క్లుప్తంగా

దవులూరి విజయానికి కృషి



వ్యాపారవేత్త వాడపర్తి వీరభద్రరావును కలిసిన దవులూరి సుబ్బారావు తదితరులు

సామర్లకోట: స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని వ్యాపార వేత్త, మాజీ పంచారామక్షేత్ర ట్రస్టు బోర్డు సభ్యుడు వాడపర్తి వీరభద్రరావును గురువారం ఆయన స్వగృహంలో వైఎస్సార్ సీపీ నాయకులు కలుసుకున్నారు. స్థానిక అభ్యర్థికి వైఎస్సార్ సీపీ నుంచి టిక్కెట్టు రావడంతో దవులూరి దొరబాబు గెలుపు కోసం కృషి చేయాలని ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు పిలుపునిచ్చారు. దొరబాబు విజయమే లక్ష్యంగా పనిచేస్తా మని వీరభద్రరావు హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ కమిటీ చైర్మన్ పాగా సురేష్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ తల్లి హుండీల ఆదాయం రూ.1.66 లక్షలు



ఆలయంలో హుండీలను తెరిపిస్తున్న అధికారులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి హుండీల ద్వారా 41 రోజులకు సుమారు రూ.1,66,797 ఆదాయం సమకూరినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు. గురువారం ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, పెద్దాపురం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ్‌బాబు నాయుడు, కాండ్రకోట నూకాలమ్మ ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణల సమక్షంలో హుండీలను లెక్కించారు. ఆలయ వేద పండితులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది, మహిళా భక్త మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలో ఇరిగేషన్ కాలువ



అచ్చంపేటలో ఆక్రమణకు గురవుతున్న ఇరిగేషన్ కాలువ

సామర్లకోట: మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలోని ఇరిగేషన్ కాలువను మూసివేసి అక్రమ లేఅవుట్ వేసి స్థలాలను విక్రయిస్తున్నారని, దీనివల్ల సాగునీరు రాక ఇబ్బంది పడుతున్నామని ఆయా ప్రాంతాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి గ్రావెల్‌ను తొలగించి రైతులను ఆదుకోవాలని. దీనిపై ఇరిగేషన్ అధికారి రెడ్డిని వివరణ కొరగా ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదుల మేరకు నోటీసులు ఇచ్చామని, అయినా స్పందించక పోవడంతో తహసీల్దార్ ద్వారా సర్వే చేయించి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు.

మహిళల మృతిపై చర్యలు తీసుకోవాలి

ఏపీ రైతు కూలీ సంఘం డిమాండ్

పెద్దాపురం: రైస్‌మిల్లు ప్రాంగణంలో ఇద్దరు మహిళల మృతి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన లలితా రైస్‌మిల్లు యాజమాన్యం తీసుకోవాలని ఏపీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజుబాబు, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కుంచే అంజిబాబు డిమాండ్ చేశారు. అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఏపీ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పులిమేరు దమ్ముపేటలో యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫ్యాక్టరీ ఆవరణలో మృతి చెందిన మోతుపల్లి నాగరత్నం, కామిశెట్టి కామేశ్వరిల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఒక్కో కుటుంబానికి 30 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.సురేష్, సత్తిబాబు, వీరన్న, నారాయణరావు, రాజు, వీరబాబు, రాంబాబు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

రంగు పడింది



కమ్యూనిటీ హాల్ రంగు మార్పిస్తున్న అధికారులు

పెద్దాపురం: మండలంలోని సిరివాడ, కాండ్రకోట, మర్లావ గ్రామాల్లో టీడీపీ వాల్‌పోస్టర్లను ఎన్నికల అధికారులు తొలగింపజేశారు. 'తెలుగుతమ్ముళ్లకు కోడ్ వర్తించదా..' అనే కథనంపై వారు స్పందించారు. గురువారం ఎంసీసీ కన్వీనర్, ఎంపీడీఓ జి.ఉషారాణి ఆధ్వర్యంలో సిరివాడ పంచాయతీ పరిధిలో టీడీపీ కమ్యూనిటీ హాల్‌కు పసుపు రంగును తొలగించి వైట్ చేశారు. ఆమె వెంట ఎంఈఓ చౌదరి, పంచాయతీ కార్యదర్శి భారతి, సిబ్బంది ఉన్నారు.

సీఎం జగన్‌కు ప్రజలే బలం

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత
- రావివారిపోడులో ఎన్నికల ప్రచారం



రావివారిపోడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ వంగా గీత

కొత్తపల్లి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలే బలమని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని పొన్నాడ శివారు రావివారి పోడులో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ జ్యోతుల వాణి, మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు ఆమెను శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కొత్త అబద్ధాలతో కూటమి నాయకులు ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలనే నమ్ముకున్నారని, చంద్రబాబు మాత్రం దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, ఎల్లో మీడియాను నమ్ముకున్నారని ఎద్దేవా చేశారు. కేఎస్ఈజెడ్ పేరుతో చంద్రబాబు రైతులను అన్నివిధాలా మోసం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలు గ్రామాలను మినహాయించడమే కాకుండా సుమారు 2180 ఎకరాలను రైతులకు తిరిగి ఇచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కారే సుధ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, కేఎస్ఈజెడ్ పోరాట కమిటీ సభ్యుడు బావిశెట్టి నారాయణస్వామి, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ తదితరులు పాల్గొన్నారు.



రావివారిపోడులో మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న వంగా గీత

పార్టీ విజయానికి కృషి చేస్తా

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'గుబ్బల'



విలేకర్లతో మాట్లాడుతున్న తులసీకుమార్

కొత్తపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తనపై నమ్మకంతో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి మరింత కృషి చేస్తానని జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన సందర్భంగా గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాలకూ న్యాయం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేయాలని సూచించారు. తనకు రాష్ట్ర కార్యవర్గంలో స్థానం కల్పించినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన తులసీకుమార్‌ను పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

ఎన్నికల నియమావళి విధిగా పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామసుందర్‌రెడ్డి

- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామసుందర్‌రెడ్డి

పిఠాపురం: కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించినందున రాజకీయ పార్టీల నేతలు విధిగా ఎన్నికల నియమావళి పాటించాలని పిఠాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ రామ సుందర్‌రెడ్డి సూచించారు. పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. రాజకీయ పార్టీల నేతలు, స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల ప్రచారాలకు ఉపయోగించే వాహనాలకు అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. అనుమతి లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. సీజ్ చేసిన వాహనాలను కోర్టు అనుమతితో తప్ప ఇవ్వబోమని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్కరూ తప్పనిసరిగా అనుమతులు పొందిన వాహనాలను మాత్రమే వినియోగించాలన్నారు. ఎన్నికల ప్రచారాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఎన్నికలు సజావుగా జరగడానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

కోడ్ అమలుకు సహకరించాలి

- ఈఆర్వో జేఎస్ రామారావు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: ఎన్నికల కోడ్ అమలుకు రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం డీఎస్పీ లతాకుమారితో కలిసి ఆయా రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, కోడ్ ఆఫ్ కాంటాక్ట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో గ్రాఫర్లు, పోలీస్ సిబ్బందితో ఎన్నికల నియమావళిపై సమీక్షించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటిలో 46 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్‌కాస్టింగ్, సీసీ కెమేరా ఏర్పాటు చేశామని, షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఈ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల పంపిణీ ఆయా పార్టీల అభ్యర్థుల సమక్షంలోనే జరుగుతుందని, ఏ బూత్‌కు ఏ ఈవీఎం వస్తుందో నెంబర్‌తో సహా చూపించే స్ట్రాంగ్ రూమ్‌లలో పెట్టనున్నట్టు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగంతా కోడ్ అమలుకు నాలుగు టీములు, ఫ్లయింగ్ స్క్వాడ్ మూడు టీములు, వీడియో సర్వేలైన్స్ (వీఎస్‌టీ) రెండు టీములు, ఎస్ఎస్‌టీ మూడు టీములు, 22 మంది సెక్టార్. 22 మంది రూట్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే ఈవీఎంలపై 424 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఎన్నికల ప్రక్రియపై ఎవరైనా ఫిర్యాదు చెయ్యాలనుకుంటే టోల్ ఫ్రీ నెంబర్ 08852241254కు చెప్పవచ్చని ఆర్డీఓ సూచించారు. డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే సహించేది లేదన్నారు. లేని పోని అల్లర్లు సృష్టించినా, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేపట్టిన చర్యలు తప్పవన్నారు. అనంతరం ఆర్డీవో రామారావు పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, కేవీ పద్మావతి, జి.ఉషారాణి, రామారావు, రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు (వైఎస్సార్ సీపీ), రంది సత్తిబాబు (టీడీపీ), డి.క్రాంతికుమార్ (సీపీఎం)తో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు, అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీ మాఫీ లబ్ధిని పొందాలి

సామర్లకోట: ఆస్తి పన్నుల బకాయిదారులు ఈ నెలాఖరు లోగా పన్నులు చెల్లించి వడ్డీ మాఫీ లబ్ధిని పొందాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు పిలుపు నిచ్చారు. ఇంటి, ఖాళీ స్థలం, కుళాయి పన్నులకు ఏక మొత్తంగా చెల్లించి ఇప్పటి వరకు విధించిన వడ్డీ రద్దు చేసుకునే అవకాశం పొందాలన్నారు. సకాలంలో చెల్లించని పన్నులపై వడ్డీ విధించడం జరుగుతుందని అయితే రాష్ట్ర ప్రభుత్వం పన్నుల బకాయిలు ఒకేసారి చెల్లిస్తే వడ్డీ రాయితీ ఇచ్చినట్టు తెలిపారు. పన్నులు చెల్లించాల్సిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏలేరు కాలువలో సెప్టీ వ్యర్థాలు



సామర్లకోట-పిఠాపురం రోడ్డులోని ఏలేరు కాలువలో సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను విడిచిపెడుతున్న ట్యాంకర్

సామర్లకోట: ఆయా మరుగుదొడ్లను శుభ్రం చేయడానికి ఉన్న సెప్టిక్ ట్యాంకర్ల నిర్వాహకులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సెప్టిక్ ట్యాంకు నుంచి వ్యర్థాలను బహిరంగంగా సామర్లకోట-పిఠాపురం రోడ్డులోని ఏలేరు కాలువలో విడిచి పెడుతున్నారు. బ్రౌన్‌పేట మీదుగా ఏలేరు కాలువ ప్రవహిస్తూ ఉండటంతో ఈ వ్యర్థాల వల్ల దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏలేరు కాలువ వెంబడి చెత్త వేయడం, వ్యర్థాలను వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కమిషనర్ జె.రామారావును వివరణ కొరగా సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకొం టామని, ట్యాంకర్ల నిర్వాహకులకు ఈ మేరకు అవగాహన కల్పించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

న్యాయ సదస్సులో విద్యుత్ సమస్యల పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం సభ్యులు

పిఠాపురం: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి గురువారం పిఠాపురం విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద విద్యుత్ సమస్యల పరిష్కార న్యాయస్థానం నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ, సభ్యులు ఎం.శ్రీనివాస్, రాయసం సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొని విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఠాపురంలో విద్యుత్ సమస్యలపై ఏడు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిపై విచారణ జరిపి 60 రోజుల్లో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త చట్టం ప్రకారం విద్యుత్ ప్రమాదాల వల్ల ఎవరికైనా నష్టం కలిగితే విద్యుత్ అధికారుల ద్వారా నష్ట పరిహారం అందించనున్నట్లు తెలిపారు. 2016 నుంచి ఇప్పటి వరకూ 7868 ఫిర్యాదులు రాగా వాటిలో 7777 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. ఇంకా 111 సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్నారు. విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి సమస్యలు ఉన్నా ఇక్కడ ఫిర్యాదు చేస్తే వాటికి పరిష్కారం చూపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ ఆర్ శ్రీనివాస్, పలువురు వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సోమేశ్వరస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న దవులూరి దొరబాబు తదితరులు

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం గ్రామంలోని రాజేశ్వరీ సమేత సోమేశ్వర స్వామి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు పాల్గొన్ని కల్యాణం తిలకించి, స్వామి వారికి పూజలు చేశారు. ఎంపీపీ సత్తిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరబాపనమ్మ జాతర

గోకవరం: గ్రామ శివారున కొత్తపల్లికి వెళ్లే మార్గంలో వేంచేసిన వరబాపనమ్మ జాతర గురువారం ఘనంగా జరిగింది. జాతరను పురస్కరించుకుని ఆలయం వద్ద వేద పండితుడు వల్లూరి జగన్నాథ శర్మ ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యటన



వీకే రాయపురంలో నిత్యావసర సరుకుల పంపిణీ వాహనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ టీమ్ మండల పరిధిలో వివిధ గ్రామాల్లో పర్యటించారు. రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, బోర్డులు, వాల్ పోస్టర్ల తొలగింపు గడువు ముగియడంతో గురువారం సాయంత్రం వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాలను పర్యటించి ప్రజల నుంచి సమాచారం సేకరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ లీడర్ ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ ప్రజలు వారి వారి ఇళ్లపై జెండాలు, బ్యానర్లు ఏర్పాటు చేసుకోవడానికి ఆర్డీఓ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడానికి వీలు లేదని హెచ్చరించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో పరిశీలించిన వివరాలను వీడియోలో చిత్రికరించారు. వీకే రాయపురం గ్రామంలో లబ్ధిదారుల ఇంటి వద్దకే నిత్యావసర సరకులు తీసుకువెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, వీకే రాయపురం, మాధవపట్నం పంచాయతీల కార్యదర్శి వై.శ్రీహరి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత సూచించారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మొక్కలు నాటడాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. మొక్కల పెంపకంతో వాతావరణ సమతుల్యత ఉంటుందన్నారు. సమాజంలో కాలుష్యాన్ని నియంత్రించడానికి ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ పీఓ ప్రగడ ప్రయాగమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, మదీనా, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం... కమనీయం

- వైభవంగా స్వామివార్ల కల్యాణం
- అధిక సంఖ్యలో వీక్షించిన భక్తులు



ధర్మవరంలో రాజగోపాలస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవం గురువారం కన్నులపండువగా జరిగింది. బుధవారం రాత్రి ఆంజనేయ, గరుడ, పొన్న, పల్లకీ, హంస వాహనాలపై స్వామి, అమ్మవార్లను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. అనంతరం ఆలయ అర్చకుడు పొడుగు ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో రుత్విక్కులు స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఏలేశ్వరం: పట్టణంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరాస్వామివారి వార్షిక కల్యాణం గురువారం ఘనంగా జరిగింది. స్థానిక బాలాజీ చౌక్‌లోని స్వామి, అమ్మవార్లకు ఆలయ ధర్మకర్త గోపు వెంకట్రావు, సుబ్బయ్యమ్మ నేతృత్వంలో అర్చకుడు సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పండితులు గోపు శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి, కటకం బాలాజీ దంపతులతో స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా రాజగోపాలస్వామి కల్యాణం

మండలంలోని లింగంపర్తిలో వేంచేసిన రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి వారి వార్షిక కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. లింగంపర్తిలో రాజగోపాలస్వామి ఆలయంలో అర్చకులు వింజరపు వెంకటప్రసాద్, సత్యరామగోపాల్ ఆధ్వర్యంలో ఆవసరాల కిషోర్, దేవి దంపతుల చేతులమీదుగా కల్యాణం ఘనంగా నిర్వహించారు. శ్రీమాన్ చక్రవర్తుల రాఘవచార్యుల శిష్య బృందం క్రతువులు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవసరాల సీతారామమూర్తి, అవసరాల వెంకటరాయుడు, ఉడతల రమణారావు పాల్గొన్నారు.



లింగంపర్తిలో స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపిస్తున్న పండితులు



ఏలేశ్వరంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరంలో...

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో వేంచేసిన రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాల స్వామి వారి వార్షిక కల్యాణం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం పండితులు స్వామివారికి నిత్యహోమం, ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా సూర్యదేవుని శాంతి కల్యాణం



తిరుమలాయపాలెంలో సూర్యదేవుని ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెంలో గురువారం ఉషాపద్మినీ సమేత సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం ఘనంగా జరిగింది. సనాతన ధర ప్రబోధనా సమితి ఆధ్వర్యంలో తొలుత ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఘనంగా ఊరేగించారు. అనంతరం శాంతి కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు తోట సాయిబాబు మాట్లాడుతూ సూర్యతత్వాన్ని ప్రజలకు తెలియజేస్తూ ప్రజలను సూర్యోపాసనకు దగ్గర చేయాలనే సంకల్పంతో ప్రతి గ్రామంలోనూ సూర్యదేవుని శాంతి కల్యాణం నిర్వహించాలని సంకల్పించామన్నారు. కార్యక్రమంలో చందనం వెంకటేశ్వరరావు, కొప్పాక కమల, చెన్నంశెట్టి మహేష్, చాగంటి సత్యనారాయణ, పిల్లంగోరు పాపారావు, కొత్తపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఎస్ఈబీ దాడులు

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం విస్తృతంగా దాడులు చేసి పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ప్రత్తిపాడు ఎస్ఈబీ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. ఏలేశ్వరంలో 35 లీటర్ల సారా, ఎనిమిది లిక్కర్ బాటిల్స్‌తో బసంతుల రాజేశ్వరిని అరెస్టు చేశామన్నారు. ప్రత్తిపాడు మండలం వేములపాలెంలో 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అదే గ్రామంలో మరో 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చిరంజీవి వివరించారు.